# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

సోమవారం 4, మే 2026


## భవిష్యత్ తరాల కోసమే రోడ్డు విస్తరణ పనులు

**❋ మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు**



**లక్షెట్టిపేట, మే 03, ప్రభాతవార్త**

భవిష్యత్ తరాల కోసమే రోడ్డు విస్తరణ పనులు చేస్తున్నామని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్సాగర్ రావు అన్నారు. ఆదివారం రోజు పట్టణంలో పర్యటనలో భాగంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. పట్టణంలోని ఉత్కూర్ చౌరస్తా నుంచి పాత బస్టాండ్ వరకు 80 ఫీట్ల రహదారి వెడల్పును తగ్గించేది లేదని ఆయన స్పష్టం చేశారు. పట్టణంలో పెరుగుతున్న ట్రాఫిక్ కష్టాలను, ప్రమాదాలను తగ్గించడానికి రోడ్ల వెడల్పు అత్యవసరమని, పట్టణ రూపురేఖలను మార్చి, మౌలిక సదుపాయాలను మెరుగుపరచాల్సిన బాధ్యత మాపై ఉందని, రోడ్ల వెడల్పు వల్ల పట్టణంలో ట్రాఫిక్ జామ్‌లు తగ్గుతాయి, ప్రయాణ సమయం ఆదా అవుతుందన్నారు. ఇది వ్యక్తిగత నిర్ణయం కాదని, పట్టణ అభివృద్ధి కోసం కొద్దిపాటి అసౌకర్యాన్ని భరించి, మాకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి కేసులో ఇద్దరు అరెస్ట్

### 690 గ్రాముల ఎండు గంజాయి, రెండు మొక్కలు స్వాధీనం

**బెల్లంపల్లి, మే 03, ప్రభాతవార్త**




మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో గంజాయి సరఫరా చేస్తున్న ఇద్దరు యువకులను పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 690 గ్రాముల ఎండు గంజాయి, రెండు గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నారు. తాళ్లగురజాల ఎస్ఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం, బట్వాన్‌పల్లి గ్రామానికి చెందిన దాగం రోహిత్ ఇంటిలో గంజాయి నిల్వ ఉన్నదని విశ్వసనీయ సమాచారం అందడంతో పోలీసులు సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో రోహిత్ ఇంటిలో ఎండు గంజాయి లభించింది. దర్యాప్తులో భాగంగా రోహిత్ మహారాష్ట్ర నుంచి గంజాయి తీసుకువచ్చి, తన స్నేహితుడు జుమ్మిడి రాజశేఖర్‌తో కలిసి చిన్న చిన్న ప్యాకెట్లుగా తయారు చేసి చుట్టుపక్కల ప్రాంతాల్లో విక్రయిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. గంజాయి వినియోగదారులకు అమ్ముతూ అక్రమంగా డబ్బులు సంపాదిస్తున్నట్లు వెల్లడైంది. అనంతరం రాజశేఖర్ ఇంటిలో కూడా పోలీసులు తనిఖీలు నిర్వహించగా, అక్కడ కూడా ఎండు గంజాయి దొరికింది. ఇంటి వెనుక భాగంలో సోదాలు చేయగా రెండు గంజాయి మొక్కలు కనిపించాయి. మహారాష్ట్ర నుంచి తరలించడంకన్నా స్థానికంగా మొక్కలు పెంచితే మరింత లాభం ఉంటుందని భావించి నిందితులు గంజాయి సాగు ప్రారంభించినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై నిషేధిత మాదకద్రవ్యాల నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసి ఇద్దరు నిందితులను జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా, వారికి రిమాండ్ విధించినట్లు ఎస్ఐ రామకృష్ణ వెల్లడించారు.

### కార్మిక సమస్యలను పరిష్కరించకుంటే మే రెండో వారంలో

## సమ్మె నోటీసు

**★ వాసిరెడ్డి సీతారామయ్య ★ సింగరేణిలో సమ్మె సైరన్ మోగించేందుకు ఏఐటీయూసీ సన్నద్ధం**

**నస్పూర్, మే 03, ప్రభాతవార్త**

సింగరేణిలో నెలకొన్న కార్మిక సమస్యలను ప్రభుత్వం, యాజమాన్యం వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో మే రెండో వారంలో సమ్మె నోటీసు అందజేస్తామని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ హెచ్చరించారు. గత ఏడెనిమిది నెలలుగా కార్మికుల పెండింగ్ సమస్యలపై యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని వారు ఆరోపించారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేస్తూ, కలిసి వచ్చే కార్మిక సంఘాలతో చర్చించి సమ్మె తేదీని ప్రకటిస్తామని స్పష్టం చేశారు. గుర్తింపు సంఘం ఎన్నికల అనంతరం డైరెక్టర్లు, సీఎండీలు మారడం వల్ల సమస్యల పరిష్కారంలో జాప్యం జరుగుతోందని నాయకులు విమర్శించారు. గతంలో జరిగిన చర్చల్లో అంగీకరించిన అంశాలను కూడా అమలు చేయడం లేదని ధ్వజమెత్తారు. ముఖ్యంగా మెడికల్ బోర్డు నిర్వహించకపోవడం వల్ల తీవ్ర అనారోగ్యంతో ఉన్న కార్మికులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే మెడికల్ బోర్డు ఏర్పాటు చేయాలని, అనారోగ్యంతో ఉన్న వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మారుపేర్లు, విజిలెన్స్ కేసుల్లో ఉన్న కార్మికుల డిపెండెంట్లకు ఉద్యోగాలు ఇవ్వడంలో యాజమాన్యం కాలయాపన చేస్తోందని వారు పేర్కొన్నారు. లీగల్ ఒపీనియన్ పేరుతో ఏడాది కాలంగా ఫైళ్లను పెండింగ్‌లో పెట్టి కార్మిక కుటుంబాలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. మైనింగ్, క్లరికల్, ట్రేడ్స్‌మెన్ సమస్యలతో పాటు సొంత ఇంటి పథకం అమలు చేయాలని, పెర్క్స్‌పై ఆదాయపు పన్ను యాజమాన్యమే చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి ఇవ్వాల్సిన 51 వేల కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని, డిస్మిస్ కార్మికులకు పునర్నియామక అవకాశం కల్పించాలని కోరారు. మే మొదటి వారంలోగా చర్చలకు రాకుంటే సమ్మె తప్పదని హెచ్చరించారు.

## ఆదివాసీల ఆత్మబంధువులు ప్రొఫెసర్ హైమన్ డార్ఫ్ జెట్టి ఎలిజిబెత్ దంపతులు

**ఆసిఫాబాద్/జైనూర్, మే 3, ప్రభాతవార్త**

ఆదివాసీల ఆత్మబంధువులు ప్రొఫెసర్ హైమన్ డార్ఫ్ జెట్టి ఎలిజిబెత్ దంపతులని సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి మంద మకరందు అన్నారు. ఆదివారం సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ఉట్నూర్ పరిధిలోని జైనూర్ మండలం మార్లవాయి గ్రామాన్ని సందర్శించి ప్రొఫెసర్ హైమన్ డార్ఫ్, బెట్టి ఎలిజబెత్, ఆదివాసి పోరాటయోధుడు కొమురం భీం విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించి అక్కడి పరిసర ప్రాంతాలను సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. మొదటిసారి మార్లవాయి గ్రామానికి విచ్చేసిన ప్రాజెక్టు అధికారికి గ్రామస్థులు ఆదివాసి సంస్కృతి, సంప్రదాయాల డప్పు వైద్యాలతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రాజెక్ట్ అధికారి మాట్లాడుతూ ఇతర ప్రాంతాల నుండి వచ్చి ఆదివాసుల అభివృద్ధి కోసం కృషి చేసిన మహనీయుల స్ఫూర్తి అందరికీ ఆదర్శనీయమని, వారు చూపిన మార్గంలో ఆదివాసీలు ముందుకు సాగడం గొప్ప విషయమని అన్నారు. మార్లవాయి చారిత్రక ప్రాంతమని, ఆదివాసి గిరిజనుల కొరకు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఆదివాసి సంస్కృతి, సాంప్రదాయాలు చాలా గొప్పవని, వాటిని ముందు తరాలకు అందించవలసిన బాధ్యత అందరిపై ఉందని తెలిపారు. విద్య, వైద్యం, వ్యవసాయం రంగాలలో ప్రత్యేక చర్యలు తీసుకొని గిరిజన ప్రాంతాల అభివృద్ధికి పని చేస్తామని తెలిపారు. పిల్లలందరూ తప్పనిసరిగా చదువుకోవాలని, డ్రాప్‌ఔట్ లేకుండా ప్రతి విద్యార్థి పాఠశాలలో కొనసాగేందుకు తల్లిదండ్రులు చొరవ తీసుకోవాలని తెలిపారు. ప్రజా సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను అర్హులైన ప్రతి గిరిజనుడికి అందే విధంగా అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు ఇతర ప్రభుత్వ పథకాలను అర్హత గల ప్రతి గిరిజనుడికి చేరేలా కృషి మిగతా 2లో..



## కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన పిఓ మంద మకరందు

**ఆసిఫాబాద్, మే 3, ప్రభాతవార్త :**

కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ హరితనుఐటిడిఏ పిఓ మంద మకరందు జిల్లాకు మొదటి సారి వచ్చిన నేపథ్యంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ ను కలిసి మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అభివృద్ధి కార్యక్రమాలు, గిరిజన ప్రాంతాల్లో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ప్రజలకు అందిస్తున్న సేవలపై చర్చించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేసి ప్రజలకు మరింత చేరువ చేయాలని కలెక్టర్ సూచించారు.



## ఆదివాసీల ఆత్మబంధువులు ప్రొఫెసర్ హైమన్ డార్ఫ్ జెట్టి ఎలిజబెత్ దంపతులు

(మొదటిపేజీ తరువాయి)

చేస్తామని తెలిపారు. అనంతరం గ్రామస్థులు డార్ఫ్ దంపతుల చిత్రపటం, డార్ఫ్ నివేదిక పుస్తకాన్ని అందించి ప్రాజెక్టు అధికారికి ఆత్మీయ సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రమాదేవి, జైనూర్ ఏటీడీఓ శ్రీనివాస్, సర్పంచ్ కనక ప్రతిభ వెంకటేశ్వరరావు, గ్రామ పెద్దలు పటేల్ ఆత్రం మాణిక్ రావు, దేవరీ కనక గణపత్, ఉపసర్పంచ్ ఆత్రం రాజేశ్వర్, జైనూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మండాడి లింగు, వార్డు సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



## వరిధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

జన్నారం, మే 3, ప్రభాతవార్త

నిర్మల్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ సహకారంతో, జిల్లా సహకార అధికారి ఆదేశాల మేరకు జన్నారం మండలం కొత్తూరుపల్లె గ్రామంలో నూతన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం ప్రారంభించారు. దేవునిగూడ సర్పంచ్ రామటెంకి రాజేష్ ఈ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ...ఇప్పటివరకు ఈ గ్రామంలో కొనుగోలు కేంద్రం లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడేవారని తెలిపారు. రైతులంతా కలిసి జనదాశివ రైతు మ్యాక్స్ ఐ పేరుతో రిజిస్ట్రేషన్ చేసుకొని, ఎమ్మెల్యే బొజ్జు పటేల్ సహకారంతో మొట్టమొదటిసారిగా ఈ సంవత్సరం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసుకున్నామన్నారు. ఇక నుంచి ఈ ప్రాంత రైతులు పండించిన ధాన్యాన్ని ఈ కేంద్రం ద్వారానే కొనుగోలు చేస్తారని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు గుర్రం మోహన్ రెడ్డి, దేవునిగూడ ఉపసర్పంచ్ కల్లెం శ్రీనివాస్ రెడ్డి, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎంబడి చంద్రమౌళి, వార్డు మెంబర్ ఎంబడి పోశన్న, కాంగ్రెస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.



## 16వ వార్డు సమస్యలపై దృష్టి సారించిన వైస్ చైర్మన్ రాగంశెట్టి సతీష్

బెల్లంపల్లి, మే 03, ప్రభాతవార్త

బెల్లంపల్లి పట్టణంలోని 16వ వార్డులో కొనసాగుతున్న 100 రోజుల అభివృద్ధి కార్యక్రమాల భాగంగా మున్సిపల్ వైస్ చైర్మన్ రాగంశెట్టి సతీష్ ఆదివారం వార్డును సందర్శించారు. ఈ కార్యక్రమంలో 16వ వార్డ్ కౌన్సిలర్ మత్తమరి రాయమల్లు పాల్గొన్నారు. వార్డు పర్యటనలో భాగంగా వీరు కాలనీల్లో తిరిగి స్థానిక ప్రజలతో నేరుగా మాట్లాడి, తాగునీరు, కాలువలు, రోడ్లు, వీధి దీపాలు, శుభ్రత వంటి ప్రాథమిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు వెల్లడించిన సమస్యలను వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, త్వరితగతిన పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ రాగంశెట్టి సతీష్ మాట్లాడుతూ బెల్లంపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు గడ్డం వినోద్ వెంకట స్వామి, మున్సిపల్ చైర్మన్ దావ స్వాతి రమేష్ మార్గదర్శకత్వంలో పట్టణ అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తూ, ప్రతి వార్డులో మౌలిక వసతులను మెరుగుపరచడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని చెప్పారు. 100 రోజుల అభివృద్ధి కార్యక్రమాల ద్వారా పట్టణంలో ఉన్న సమస్యలను గుర్తించి, దశలవారీగా పరిష్కరిస్తూ బెల్లంపల్లిని మరింత అభివృద్ధి దిశగా తీసుకెళ్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, మున్సిపల్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

# బౌద్ధం ద్వారానే సమానత్వ సమాజం సాధ్యం: కోలా శ్యామ్

బెల్లంపల్లి, మే 03, ప్రభాతవార్త



మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలోని సుబ్బారావుపల్లి జైభీమ్ భవన్‌లో పూలే-పెరియార్-అంబేద్కర్ ఆలోచన వేదిక ఆధ్వర్యంలో అధ్యయన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వేదిక ప్రధాన సలహాదారు వేల్పుల కనకయ్య అధ్యక్షత వహించగా, భారత బౌద్ధ సమాజం అధ్యక్షుడు కోలా శ్యామ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చారిత్రక బౌద్ధం - సామాజిక విశ్లేషణ అంశంపై కోలా శ్యామ్ ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ బౌద్ధం క్రీస్తుపూర్వం 5వ శతాబ్దంలో మగధ రాజ్యంలో సిద్ధార్థ గౌతముడు బోధించిన ధర్మం నుండి ఉద్భవించిందని వివరించారు. సమానత్వం, నైతికత, దుఃఖ విముక్తి వంటి విలువలను బోధించే ఈ మతం, మౌర్య చక్రవర్తి అశోకుడి కాలంలో విస్తరించి, నేడు ప్రపంచవ్యాప్తంగా కోట్లాది ప్రజలు ఆచరిస్తున్న ప్రధాన మతాలలో ఒకటిగా నిలిచిందని తెలిపారు. సిద్ధార్థ గౌతముడు క్రీ.పూ. 6వ శతాబ్దంలో లుంబినిలో జన్మించి జ్ఞానోదయం పొంది బుద్ధుడు గా మారిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. బౌద్ధంలో బాధల అర్థం, జ్ఞానం, నైతిక జీవనం ప్రధానమైన అంశాలని చెప్పారు. అహింస, కరుణ, మధ్యమ మార్గం వంటి సిద్ధాంతాల ద్వారా బౌద్ధం ప్రపంచ నాగరికతపై చెరగని ముద్ర వేసిందన్నారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ బౌద్ధ సూత్రాలైన సమత, మమత, సమానత్వం ద్వారానే బలహీన వర్గాలకు విముక్తి సాధ్యమని విశ్వసించి, 1956 అక్టోబర్ 14న నాగ్‌పూర్‌లో లక్షలాది అనుచరులతో కలిసి బౌద్ధమతాన్ని స్వీకరించినట్లు తెలిపారు. ఆయన రచించిన బుద్ధుడు, అతని ధమ్మ గ్రంథం నవయాన బౌద్ధానికి పునాది అని పేర్కొన్నారు. అంబేద్కర్ కులవ్యవస్థను తీవ్రంగా విమర్శించారని, కులాంతర భోజనాలు లేదా వివాహాలు మాత్రమే సరిపోవని, కులవ్యవస్థకు ఆధారమైన మతపరమైన భావనలను నిర్మూలించడం ద్వారానే సమాజంలో నిజమైన సమానత్వం సాధ్యమని ఆయన అభిప్రాయపడ్డారని కోలా శ్యామ్ చెప్పారు. ఈ కార్యక్రమంలో జీ.ఏ. జ్యోతి కుమార్, గోడిసెల శ్రీహరి, రంగ ప్రశాంత్, అక్కు కృష్ణ, రవి రాజ్, ఉండ్రాల రవి, కమల్, బక్కయ్య, ఎం. ప్రేమ్ కుమార్, కొమ్ము బాపు, మద్దివెని చిన్న భీమయ్య, రజిని పాలేకర్, యు. ఎల్లయ్య, గోడిసెల స్వామి, దుబాసి రవి తదితరులు పాల్గొన్నారు.

## కారు వ్యాను ఢీ.. ఒకరి మృతి

లక్షెట్టిపేట, మే 03, ప్రభాతవార్త




మున్సిపాలిటీలోని ఇటిక్యాల ఈనాడు కార్యాలయం ముందు శనివారం రాత్రి మామిడికాయల లోడ్‌తో వస్తున్న వ్యాన్‌ను కారు ఢీకొనడంతో వ్యాన్‌లో ఉన్న జైపూర్ మండలం కిష్టాపూర్ గ్రామానికి చెందిన దండ యోగేందర్ అనే 43 సంవత్సరాల వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై గోపతి సురేష్ తెలిపారు. మృతుడు వ్యవసాయం చేసుకుంటూ మనకున్న మామిడి తోటలను చూసుకుంటూ జీవిస్తున్నాడు. కిష్టాపూర్ గ్రామానికి చెందిన వాళ్లకి తెలిసిన వ్యక్తి శ్రీనివాసరెడ్డి అనే అతను తన మామిడి తోటలో మామిడికాయలను కోసి మృతుడు లక్షెట్టిపేటలో తన తోటలో కాయలు అమ్మిన విషయం తెలుసుకొని, ఆయనను వెంటబెట్టుకొని లక్షెటిపేటకు వ్యాన్‌లో వస్తుండగా లక్షటపేట వైపు నుండి మంచిరాల వైపు వెళ్తున్న కారు వ్యానును ఎదురుగా ఢీకొనగా వ్యాన్ బోర్లా పడి యోగేందర్ మృతిచెందాడు. మృతునికి భార్య ఇద్దరు పిల్లల సంతానం కలరు. మృతుని భార్య దండ లావణ్య ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్ పై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేయడం జరుగుతుంది. కాగా ఈ ప్రమాదంలో వ్యాన్‌లో ఉన్న శ్రీనివాస్ రెడ్డితో పాటు వ్యాన్ నడుపుతున్న డ్రైవర్ రాథోడ్ హరీష్‌కు కూడా గాయాలయ్యాయి.

## కృషి ఉంటే.. ఏదైనా సాధ్యమే!

### - డాక్టర్‌గా సామాన్య రైతు బిడ్డ

చింతలమానేపల్లి, మే 3, ప్రభాతవార్త:

పట్టుదల ఉంటే పేదరికం ప్రతిభకు అడ్డుకాదని మండల కేంద్రానికి చెందిన సామాన్య రైతు బిడ్డ నిరూపించింది. మారుమూల గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చి, వైద్య విద్యలో ఎంబీబీఎస్ పట్టా సాధించి మండలానికే వన్నె తెచ్చింది. మండల కేంద్రానికి చెందిన డోంగ్రే సదాశివ్-అమృత దంపతుల కుమార్తె హరిప్రియ, ఉస్మానియా మెడికల్ కాలేజీలో జరిగిన గ్రాడ్యుయేషన్ వేడుకలో డాక్టర్ పట్టా అందుకుంది. మండల కేంద్రం నుంచి వైద్య విద్య పూర్తి చేసిన తొలి మహిళగా నిలువడం విశేషం. హరిప్రియ ప్రాథమిక విద్య నుంచి ఇంటర్ వరకు సోషల్ వెల్ఫేర్ మరియు సి.ఓ.ఈ విద్యా సంస్థల్లోనే సాగింది. 2020లో అత్యుత్తమ ప్రతిభతో ఉస్మానియా మెడికల్ కాలేజీలో సీటు సాధించిన ఆమె, కఠిన శ్రమతో విద్యను పూర్తి చేసింది. శనివారం జరిగిన 175వ బ్యాచ్ పట్టాభిషేక మహోత్సవంలో గవర్నర్ శివప్రతాప్ శుక్లా, మంత్రి దామోదర రాజనరసింహల చేతుల మీదుగా ఆమె పట్టా స్వీకరించింది. ఒక సామాన్య రైతు కుటుంబానికి చెందిన యువతి డాక్టర్‌గా ఎదగడం పట్ల గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తు. గ్రామీణ విద్యార్థులకు హరిప్రియ విజయం ఒక ప్రేరణ అని కొనియాడుతున్నారు. భవిష్యత్తులో ఆమె ఉన్నత స్థాయికి చేరుకుని, పేద ప్రజలకు సేవ చేయాలని స్థానికులు అన్నారు.




మండలం నుంచి తొలి మహిళా వైద్యురాలిగా డోంగ్రే హరిప్రియ



## పోలీస్ పత్రిక బృందం ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్

పెంచికల్‌పేట్, మే 3, ప్రభాతవార్త :

మండలంలోని అగర్ గూడ గ్రామంలో ఆదివారం పోలీస్ శాఖ పత్రిక బృందం సంయుక్తంగా నిర్వహించిన ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ ఉత్సాహభరితంగా సాగింది. కాగజ్ నగర్ రూరల్ సీఐ కుమారస్వామి ముఖ్యఅతిథిగా హాజరై ఆటలో పాల్గొని క్రీడాకారులను ప్రోత్సహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ ప్రజల మధ్య స్నేహపూర్వక వాతావరణం పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు క్రీడలు ఆరోగ్యాన్ని మెరుగుపరచడం కాకుండా పరస్పర ఐక్యతను పెంచుతాయని అన్నారు. అనంతరం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు బాల్నే ప్రసాద్ మాట్లాడుతూ పోలీస్ ప్రెస్ బృందం ఆధ్వర్యంలో భవిష్యత్తులో మరిన్ని క్రీడలను సంయుక్తంగా పంచుకోవాలని గ్రామాల్లో యువతను మేలుకొల్పేందుకు యువకులలో క్రీడా సామర్థ్యాన్ని పెంపొందించేందుకు ఆటలు ఎంతగానో తోడ్పడతాయని అన్నారు. 10 ఓవర్ల ఇన్నింగ్స్ లో ప్రెస్ జట్టుపై పోలీస్ జట్టు 4 వికెట్లు కోల్పోయి విజయాన్ని సాధించింది. ఈ కార్యక్రమంలో ఎస్సై అనిల్ కుమార్, పాత్రికేయులు, పోలీస్ సిబ్బంది, వివిధ గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు యువకులు క్రీడాకారులు పాల్గొన్నారు

## ఈనెల 5న చింతగూడ కోయవాగులో హిందూ సమ్మేళనం

### - సన్నాహాలు వేగం - ఇంటింటికీ ఆహ్వానం

### - సమాజంలో ఐక్యతను పెంపొందించడమే ప్రధాన లక్ష్యం

కాగజ్‌నగర్ రూరల్, మే 3, ప్రభాతవార్త :



కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలంలోని చింతగూడ కోయవాగు గ్రామంలోని (ప్లాంటేషన్) ప్రాంతంలో నిర్వహించనున్న హిందూ సమ్మేళనం కార్యక్రమానికి సన్నాహాలు వేగంగా కొనసాగుతున్నాయి. ఈనెల 5వ తేదీన ఉదయం 10 గంటల నుండి ఈ సమ్మేళనం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. చింతగూడ కోయవాగులో జరిగే ఈ హిందూ సమ్మేళనం ద్వారా సమాజంలో ఐక్యతను పెంపొందించడమే ప్రధాన లక్ష్యమని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలనే ఉద్దేశంతో నిర్వాహకులు ఇంటింటికి వెళ్లి ప్రజలకు ఆహ్వాన పత్రాలు అందజేస్తూ, కార్యక్రమం ప్రాముఖ్యతను వివరిస్తున్నారు. సనాతన ధర్మ పరిరక్షణ, సామాజిక ఐక్యత, సంప్రదాయ విలువల ప్రోత్సాహం లక్ష్యంగా ఈ సమ్మేళనం నిర్వహించబడుతున్నట్లు తెలిపారు. మహిళలు, యువకులు, పెద్దలు కలిసి ఉత్సాహంగా ఈ ఆహ్వాన యాత్రలో పాల్గొనడం విశేషంగా నిలిచింది. ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

# పైప్‌లైన్ లీకేజీ మరమ్మతు పనులను పరిశీలించిన మున్సిపల్ చైర్‌పర్సన్

**బెల్లంపల్లి, మే 03, ప్రభాతవార్త**

బెల్లంపల్లి పట్టణంలోని మెయిన్ రోడ్ సింగరేణి స్టోర్ ప్రధాన రహదారిపై చోటుచేసుకున్న పైప్‌లైన్ లీకేజీ మరమ్మతు పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ దావ స్వాతి రమేష్ బాబు స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె పనుల పురోగతిని, నాణ్యతను దగ్గరుండి పరిశీలించి సంబంధిత ఇంజినీరింగ్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. లీకేజీ కారణంగా నీటి వృథా జరుగడమే కాకుండా రహదారి బలహీనపడే ప్రమాదం ఉందని, భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు తలెత్తకుండా శాశ్వత పరిష్కార చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. మరమ్మతు పనులలో భాగంగా రహదారిని తవ్వడంతో మట్టి, గుంతలు ఏర్పడి వాహనదారులు, పాదచారులకు ఇబ్బందులు కలిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. ముఖ్యంగా ఇది ప్రధాన రహదారి కావడంతో రోజువారీగా భారీ వాహన రాకపోకలు జరుగుతాయని,



అందువల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. అవసరమైతే హెచ్చరిక బోర్డులు, బ్యారికేడ్లు ఏర్పాటు చేసి ప్రజలకు ముందస్తు సమాచారం అందించాలని సూచించారు. అదేవిధంగా పనులను ఆలస్యం చేయకుండా వేగవంతంగా పూర్తి చేసి, తవ్విన ప్రాంతాన్ని సరిగా మళ్లీ పూడ్చి రహదారిని యథావిధిగా పునరుద్ధరించాలని చెప్పారు. పనులు పూర్తైన అనంతరం రహదారి స్థితిని పరిశీలించి అవసరమైన మరమ్మతులు చేయాలని, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని అధికారులకు స్పష్టం చేశారు. స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను దృష్టిలో ఉంచుకుని, ఇలాంటి అత్యవసర పనులను ప్రాధాన్యతగా తీసుకుని త్వరితగతిన పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇంటిని ప్రారంభిస్తున్న సర్పంచ్ సిరం సుష్మారెడ్డి

## అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి

### - సర్పంచ్ సిరం సుష్మారెడ్డి

**భైంసా, మే 03, ప్రభాతవార్త:**

ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ సహకారంతో అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు కృషి చేస్తానని దేగాం సర్పంచ్ సిరం సుష్మారెడ్డి తెలిపారు. ఆదివారం దేగాం గ్రామంలో ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రతి పేదవాడికి సొంత ఇల్లు ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటా ఉందన్నారు. గత పదేళ్ల పాలనలో ఒక్కరికి కూడా ఇల్లు నిర్మించి ఇవ్వలేదని విమర్శించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ దశలవారీగా ఇళ్లు మంజూరు చేయిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు పాతర్ల నరేశ్ ముదిరాజ్, పోల్కం కవిత ముదిరాజ్, లక్కడి ఆనంద్ ముదిరాజ్, అయిండ్ల మోహన్ రెడ్డి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న మాజీ ఎమ్మెల్యే నారాయణ్ రావు పటేల్

## నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే నారాయణ్ రావు పటేల్

**భైంసా, మే 03, ప్రభాతవార్త:**

భైంసా పట్టణం, పరిసర గ్రామాల్లో నిర్వహించిన పలు వివాహ వేడుకల్లో ముధోల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ, మాజీ శాసనసభ్యులు భోంస్లే నారాయణ్ రావు పటేల్ పాల్గొన్నారు. వివాహ కార్యక్రమాలకు హాజరైన ఆయన నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శంకర్ చంద్ర, పార్టీ అధికార ప్రతినిధి చంద్రకాంత్, భోజన్న పటేల్, ఓంప్రకాష్, దేవదాస్, శ్యామ్ రావు పటేల్ తదితర నాయకులు పాల్గొన్నారు.

## రైతులు అధైర్య పడొద్దు.. అండగా ఉంటా: ఆడే గజేందర్

**నేరడిగొండ, మే 03, ప్రభాతవార్త:**

బోథ్ మండలంలోని కనుగుట్ట గ్రామంలో వందల ఎకరాల్లో సాగు చేసిన మొక్కజొన్న, జొన్న పంటలు అగ్నిప్రమాదంలో కాలిపోవడం బాధాకరమని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ ఆడే గజేందర్ అన్నారు. ఆదివారం ఆయన ప్రమాద స్థలాన్ని పరిశీలించి బాధిత రైతులతో మాట్లాడారు. ఈ విషయాన్ని ఇప్పటికే ముఖ్యమంత్రి కార్యాలయం, జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు, కలెక్టర్, ఎస్పీ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. రైతులకు ప్రభుత్వం తరపున న్యాయం జరిగేలా చూస్తామని, ఎవరూ అధైర్య పడొద్దని ఆయన భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## నేడు రైతు వారోత్సవం

**చింతలమానేపల్లి, మే 3, ప్రభాతవార్త:**

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా సోమవారం మండలంలోని అన్ని రైతు వేదికలో రైతు వారోత్సవం నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి కార్తిషా తెలిపారు. ఉదయం 9:30 గంటలకు ప్రారంభమయ్యే ఈ సదస్సులో వ్యవసాయ అధికారులు రైతులకు సాగు పద్ధతులపై అవగాహన కల్పిస్తారని. ముఖ్యంగా నేల ఆరోగ్య పరిరక్షణ, ఎరువుల వాడకం, ప్రకృతి వ్యవసాయం, విత్తన శుద్ధి, యంత్రీకరణ వంటి అంశాలపై శాస్త్రీయ మెలకువలను వివరిస్తారని. రైతులు అధిక సంఖ్యలో హాజరై నిపుణుల సలహాలు పొందాలని ఆమె అన్నారు.



## జల్ జంగల్ జమీన్ పోరాట యోధునికి నివాళులు

### - సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి మకరందు

**కెరమెరి,మే 3, ప్రభాతవార్త:**

ఆదివాసీల ఆరాధ్య దైవం జల్ జంగల్ జమీన్ కొరకు పోరాట యోధుడికి ఆదివారం కేరమేరి మండలం జోడెంఘాట్‌కు సందర్శించి అమర వీరుడు కొమురం భీమ్ విగ్రహానికి పూలమాలలు సమర్పించి నివాళులు అర్పించారు. అనంతరం అక్కడి మ్యూజియాన్ని సందర్శించి, ప్రాంతీయ చరిత్ర మరియు గిరిజనుల పోరాట గాథలపై వివరాలు తెలుసుకున్నారు.

## ఆసిఫాబాద్ ఎస్డిపిఓగా అశోక్ బాధ్యతల బాధ్యతల స్వీకరణ

**ఆసిఫాబాద్, మే 3, ప్రభాతవార్త :**



ఆసిఫాబాద్ సబ్ డివిజన్ ఎస్‌డీపీఓగా బి. అశోక్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు, సిబ్బంది ఆయనకు స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణకు కట్టుబడి పనిచేస్తానని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తానని పేర్కొన్నారు. జిల్లాలో నేర నియంత్రణ, ట్రాఫిక్ నిర్వహణ, మహిళల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు తెలిపారు. గతంలో ఎస్‌డీపీఓగా పని చేసిన ఐపిఎస్ అధికారి చిత్త రంజన్ ఏఎస్పీగా(అడ్మిన్) పదోన్నతి రావడంతో ఆసిఫాబాద్ లో ఖాళీ ఏర్పడింది.

## బ్రహ్మోత్సవాలకు విరాళం అందించిన సర్పంచ్ కావేరి

**నార్నూర్, 03 మే, ప్రభాతవార్త:**

మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర ఆలయంలో 3వ వార్షికోత్సవం సందర్భంగా చేపట్టనున్న బ్రహ్మోత్సవాలు, శ్రీవారి కళ్యాణ నిర్వహణకు సర్పంచ్ బానోత్ కావేరి గజానంద్ నాయక్ ఆదివారం రూ 11000 విరాళం అందజేశారు. బ్రహ్మోత్సవాల విజయవంతం చేయుటకు కృషి చేయాలనీ అన్నారు. సర్పంచుల సంఘం మాజీ రాష్ట్ర కార్యదర్శి బానోత్ గజానంద్ నాయక్ బ్రహ్మోత్సవాల పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ చౌహాన్ మహేందర్, పెసా చైర్మన్ సికిందర్ రాథోడ్, బాలాజీ జాదవ్, చౌహాన్ ప్రేమ్ సెట్, ఆడే సంజు, ఆడే సురేష్, చౌహాన్ రాజు, తిరుపతి జాదవ్, ఆడే దినేష్, భారత్, ఫుల్ సింగ్, ప్రేమ్ సింగ్, తులసి దాస్, దుర్గా సింగ్ తదితరులున్నారు.



## కోఆప్షన్ సభ్యుని సన్మానించిన బుడగ జంగం నాయకుడు

**సారంగాపూర్, మే 03, ప్రభాతవార్త:**

నిర్మల్ మున్సిపాలిటీ కోఆప్షన్ సభ్యుడిగా నూతనంగా ఎన్నికైన గాజుల రవికిరణ్‌ను బుడగ జంగం జిల్లా ప్రచార కార్యదర్శి దరువు భోజన్న మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఆదివారం రవికిరణ్ నివాసంలో ఆయనను కలిసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్పిఎస్ ఎంఎస్పీ జిల్లా కోఆర్డినేటర్ శనిగారపు రాజు, నియోజకవర్గ ఇంచార్జ్ కోలగాని రాజు, దిలావర్‌పూర్ మండల ఇంచార్జ్ సిర్మల్ బాబున్న, నిర్మల్ మండల వాగ్మారి అంజి తదితరులు పాల్గొన్నారు.



కోఆప్షన్ సభ్యుడు గాజుల రవికిరణ్‌ను సన్మానిస్తున్న బుడగ జంగం సంఘం నేత దరువు భోజన్న

# షంషీర్‌నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యుల కొరత

## వెంటనే నియామకాలు చేయాలి

**బెల్లంపల్లి, మే 03, ప్రభాతవార్త**

బెల్లంపల్లి పట్టణంలోని షంషీర్ నగర్‌లో ఉన్న పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (యూపిహెచ్‌సి)లో వైద్యుల కొరత తీవ్రంగా ఉందని, వెంటనే డాక్టర్లను నియమించాలని ఎంసీపీఐయు పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి పసుపులేటి వెంకటేష్ డిమాండ్ చేశారు. అదేవిధంగా వారంలో కనీసం ఒక్కరోజైనా జిల్లా అధికారులు కేంద్రాన్ని పర్యవేక్షించాలని కోరారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం కేంద్రంలో డాక్టర్ లేకపోవడం లేదా ఒకరే ఉండటం వల్ల రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఉన్న ఒక్క డాక్టర్‌ను కూడా తరచూ క్యాంపులకు పంపడంతో, కేంద్రానికి వచ్చిన రోగులకు సరైన వైద్య సేవలు అందడం లేదని ఆరోపించారు. షంషీర్ నగర్, చిన్న బుధ, రాళ్లపేట, ఇందిరా నగర్ వంటి బస్తీలతో పాటు బెల్లంపల్లి పట్టణంలోని పలు వార్డుల ప్రజలు ఈ కేంద్రంపై ఆధారపడుతున్నారని చెప్పారు. అయితే జ్వరం లేదా ఇతర అనారోగ్య సమస్యలతో కేంద్రానికి వచ్చినప్పుడు డాక్టర్ అందుబాటులో




లేకపోవడంతో, ప్రజలు బెల్లంపల్లిలోని కెమికల్ ఏరియా ఆసుపత్రికి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్, బెల్లంపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి స్పందించి, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులను నియమించి ప్రజలకు నిరంతరం వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

**సారంగాపూర్, మే 04, ప్రభాతవార్త:**

మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రకటించిన రూ. 3,699 మద్దతు ధరకు రైతులు తమ పంటను అమ్ముకోవాలని సూచించారు. దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ అబ్దుల్ ఆది, మార్కెట్ సీఈఓ దుందా, పీఏసీఎస్ సీఈఓ మల్లేష్, బీజేపీ మండలాధ్యక్షుడు కాల్వ నరేష్, వివిధ గ్రామాల సర్పంచులు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.



వరుడు రసూల్‌ను నోట్ల దండతో సత్కరిస్తున్న నాయకులు, మిత్రులు

## వరుడికి నోట్ల దండతో శుభాకాంక్షలు

**సిరికొండ, మే 04, ప్రభాతవార్త:**

సిరికొండ మండల కేంద్రంలో ఆదివారం జరిగిన ఒక వివాహ వేడుక అందరి దృష్టిని ఆకర్షించింది. స్థానిక రసూల్ వివాహానికి హాజరైన రాజకీయ నాయకులు, ముఖ్య అనుచరులు వరుడిపై తమ అభిమానాన్ని వినూత్నంగా చాటుకున్నారు. సాధారణంగా పూలదండలతో శుభాకాంక్షలు తెలపడం ఆనవాయితీ కాగా, ఇక్కడ వరుడికి నోట్ల కట్టలతో తయారు చేసిన భారీ డబ్బుల దండను మెడలో వేసి అభినందనలు తెలిపారు. ఈ అరుదైన దృశ్యం పెళ్లికి వచ్చిన అతిథుల్లో చర్చనీయాంశమైంది. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, బంధుమిత్రులు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.



## బుద్ధుని చూపిన సన్మార్గంలో నడుచుకోవాలి

● డాక్టర్ ప్రసంజీత్ హేమ్లే

**భైంసా, మే 03, ప్రభాతవార్త:**

గౌతమ బుద్ధుడు చూపిన ఆర్య సత్యాలు తెలుసుకొని, అష్టాంగ మార్గంలో ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని ది బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా బౌద్ధాచార్యులు డాక్టర్ ప్రసంజీత్ హేమ్లే పిలుపునిచ్చారు. భైంసాలోని వివిధ కాలనీలు, బుద్ధ విహార్‌లో బీఎస్ఐ, ఎస్ఎస్డీ ఆధ్వర్యంలో బుద్ధుని 2570వ త్రిగుణ వైశాఖ బుద్ధ పూర్ణిమ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ధమ్మ ధ్వజాన్ని ఎగురవేసి, బుద్ధునితో పాటు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి దీప ధూప పూజలు చేశారు. ఈ సందర్భంగా ప్రసంజీత్ హేమ్లే మాట్లాడుతూ సమాజ హితం కోసం సర్వసుఖాలను త్యాగం చేసిన మహోన్నతుడు బుద్ధుడన్నారు. 29 ఏళ్ల వయసులో సత్యాన్వేషణకు బయలుదేరిన సిద్ధార్థుడు, 35 ఏళ్ల వయసులో గయలోని బోధి వృక్షం కింద జ్ఞానోదయం పొంది బుద్ధుడిగా మారారని వివరించారు. సామాన్యులకు అర్థమయ్యేలా పాళీ భాషలో బోధనలు చేశారని, సారనాథ్‌లో ఆయన చేసిన మొదటి ఉపన్యాసం ధమ్మచక్ర పవర్తనగా నిలిచిపోయిందన్నారు. పంచశీల, ఆర్య అష్టాంగ మార్గాలు శాంతియుత జీవనానికి దోహదపడతాయని తెలిపారు. బుద్ధుడు, అంబేద్కర్, పూలే వంటి మహాపురుషుల ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో గంగాధర్ దగ్డే, దమ్మనంద్ దేవ్కే, అక్షయ్ గాయక్వాడ్, లక్ష్మణ్ జంగ్మే, నారాయణ్ దుగే తదితరులు పాల్గొన్నారు.

## కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ నూతన కమిటీ ఎన్నిక

**కాగజ్‌నగర్ రూరల్, మే 3, ప్రభాతవార్త :**

కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని వివిధ శాఖల అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారం, హక్కుల సాధన కోసం ఐక్యంగా ముందుకు సాగాలని నిర్ణయించారు. ఈ క్రమంలో ఆదివారం కాగజ్‌నగర్‌లోని అంబేద్కర్ భవన్‌లో జరిగిన ముఖ్య సమావేశంలో జిల్లా స్థాయి జేఏసీ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో ఉద్యోగుల సమస్యలు, భవిష్యత్ కార్యాచరణపై చర్చించి, సంఘాన్ని బలోపేతం చేయడానికి నిర్ణయాలు తీసుకున్నారు. అనంతరం ఏకగ్రీవంగా జిల్లా కమిటీని ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడిగా చెంద్యాల రాంచందర్ (మున్సిపాలిటీ శాఖ), ప్రధాన కార్యదర్శిగా పోలోజు సంతోష్ కుమార్ (మైనారిటీ శాఖ) ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా ఎం.డి. అంకౌస్ (అటవీ శాఖ), ఎం. సత్యనారాయణ (నీటి పారుదల శాఖ), మార్కండేయ (వైద్య ఆరోగ్య శాఖ) బాధ్యతలు స్వీకరించారు. కోశాధికారులుగా సాగాల రవి (మున్సిపాలిటీ శాఖ), జెడ్. సుఖ్‌దేవ్ (నీటి పారుదల శాఖ) ఎన్నికయ్యారు. ప్రచార కార్యదర్శులుగా బొడ్డు సాగర్ (మున్సిపాలిటీ శాఖ), రేగుల నవీన్ (వైద్య ఆరోగ్య శాఖ) నియమితులయ్యారు. ఉప ప్రధాన కార్యదర్శులుగా ఇప్పలపల్లి చక్రధర్ (అటవీ శాఖ), పి. నవీన్ కుమార్ (నీటి పారుదల శాఖ), బి. శ్రీకాంత్ (పంచాయతీ రాజ్ శాఖ) ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన జిల్లా అధ్యక్షుడు చెంద్యాల రాంచందర్ మాట్లాడుతూ, జిల్లాలోని అన్ని శాఖల అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంక్షేమమే లక్ష్యంగా ఈ సంఘం పనిచేస్తుందని తెలిపారు. పెండింగ్ వేతనాలు, ఉద్యోగ భద్రత వంటి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. త్వరలోనే పూర్తిస్థాయి కార్యాచరణను ప్రకటిస్తామని వెల్లడించారు. ఇతర కార్యవర్గ సభ్యులు, మహిళా ప్రతినిధులు కూడా ఎంపికైనందుకు సమావేశంలో పాల్గొన్న నాయకులు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ శాఖల ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ఎన్నికైన నూతన కమిటి సభ్యులు



విద్యార్థులను సన్మానిస్తున్న సర్పంచ్ సాయినాథ్

## వాటోలి గ్రామంలో విద్యార్థులకు ఘన సన్మానం

**భైంసా, మే 03, ప్రభాతవార్త:**

భైంసా మండలంలోని వాటోలి గ్రామంలో పదవ తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ ఏడాది గ్రామానికి చెందిన 22 మంది విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి గ్రామానికి గర్వకారణంగా నిలిచారు. గ్రామ సర్పంచ్ సిహెచ్ సాయినాథ్, ఉపసర్పంచ్ జంగం ఓంప్రకాష్ ఆధ్వర్యంలో హనుమాన్ ఆలయం వద్ద జరిగిన ఈ వేడుకలో ఎంప్లాయిస్ యూనియన్, వీడీసీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులను శాలువాలతో సత్కరించి, అభినందన పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఓంప్రకాష్, మల్లికార్జున మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తులో సరైన గ్రూపులను ఎంచుకుని, లక్ష్య సాధన కోసం కష్టపడి చదవాలని సూచించారు. సర్పంచ్ సాయినాథ్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షిస్తూ, వారికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ప్రతి ఏటా ఇలాంటి ప్రోత్సాహక కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆయన హామీ ఇచ్చారు. విద్యార్థుల విజయమే గ్రామ అభివృద్ధికి పునాది అని గ్రామ పెద్దలు కొనియాడారు.

## అడవి పందుల దాడిలో వరి పంట ధ్వంసం

- కష్టపడి పండించిన పంట ఒక్క రాత్రిలో నాశనం అని రైతు ఆవేదన

**జన్నారం, మే 3, ప్రభాతవార్త**



జన్నారం మండలం తపాలాపూర్ గ్రామ సమీపంలో శనివారం రాత్రి అడవి పందులు బీభత్సం సృష్టించాయి. రైతు జెల్ల భీమయ్యకు చెందిన వరి పంటను పూర్తిగా ధ్వంసం చేశాయి. చేతికొచ్చిన వరి పంటను అడవి పందుల గుంపు దాడి చేసి సుమారు రెండు ఎకరాల వరకు పనికిరాకుండా చేసిందని బాధిత రైతు జెల్ల భీమయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంట ఒక్క రాత్రిలో నాశనమైందని వాపోయారు. ఈ ఘటనపై అటవీశాఖ అధికారులు వెంటనే స్పందించి, పంట నష్టాన్ని అంచనా వేసి తగిన నష్టపరిహారం చెల్లించాలని బాధిత రైతు కోరారు. గతంలో కూడా ఈ ప్రాంతంలో అడవి పందుల బెడద ఉందని, అధికారులు శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామ రైతులు విజ్ఞప్తి చేశారు.

## కరాటేలో ప్రతిభ కనబరిచి బ్లాక్ బెల్ట్ సాధించిన ప్రభుత్వ కళాశాల విద్యార్థిని

**జన్నారం, మే 3, ప్రభాతవార్త**

శనివారం హైదరాబాద్‌లో జరిగిన కరాటే పోటీల్లో జన్నారం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని ఎండి. అస్మా అత్యుత్తమ ప్రతిభ కనబరిచిందని కళాశాల ప్రిన్సిపాల్ విజిత్ కుమార్ తెలిపారు. ప్రథమ సంవత్సరం సీఈసీ గ్రూప్ చదువుతున్న అస్మా, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ చేతుల మీదుగా బ్లాక్ బెల్ట్ సర్టిఫికెట్ అందుకుంది. కళాశాలకు, జన్నారం ప్రాంతానికి అస్మా మంచి పేరు తీసుకొచ్చిందని అయన హర్షం వ్యక్తం చేశారు. చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించడం గర్వకారణమని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు ఎం. విజిత్ కుమార్, బాబురావు, సాయికుమార్, రవీందర్, నాగేశ్వర, మోహన్, దేవేందర్, శశికళ, స్వరూప, కరుణాకర్, కుమారస్వామి, శివరాం విద్యార్థినిని అభినందించారు.

